‘ముందస్తు పన్ను’కు విశేష స్పందన

- 5 శాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం
- పన్నులు చెల్లించేందుకు క్యూకడుతున్న నగరవాసులు
- నగరపాలకకు రూ.4.48 కోట్ల ఆదాయం



నగరపాలక సంస్థ కార్యాలయం



నగరపాలక కార్యాలయంలో ముందస్తు పన్నులు చెల్లించేందుకు క్యూకట్టిన పన్నుదారులు

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థలో 2022–2023 ఆర్థిక సంవత్సరం ముగిసింది. పాత బకాయిలకు ఎలాంటి వడ్డీలేకపోవడంతో నగర ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్నులను చెల్లించారు. దీంతో నగర పాలకకు గణనీయంగా ఆదాయం వచ్చింది. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో 2023– 2024 ఆర్థికసంవత్సరానికి ముందస్తు పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించారు. ఇంటి పన్ను, నీటి పన్నుపై 5 శాతం రాయితీ కల్పించడంతో పన్నుదారులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో వచ్చే ఏడాది (ముందస్తు పన్ను) మార్చి నెలాఖరు లోపు చెల్లించాల్సిన పన్నులను సైతం ఇప్పుడే చెల్లిస్తున్నారు. ప్రతి రోజు నగరపాలక సంస్థ పన్ను కౌంటర్ల వద్ద సందడి నెలకొంది.ముందస్తు పన్ను చెల్లించేందుకు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు.

కౌంటర్ల వద్ద సౌకర్యాల కల్పన :
ఒక వైపు మండుతున్న ఎండల్లోనూ నగర వాసులు ముందస్తు పన్నులు చెల్లించేందుకు వస్తుండటంతో నగరపాలక రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పన్నుదారుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. నీటి సౌకర్యం కల్పించింది. పురుషులకు, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. క్యూలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, నగరపాలక రెవెన్యూ అధికారి జునీద్ ప్రతి రోజు పర్యవేక్షణ చేస్తున్నారు. ఈనెలాఖరు వరకు పన్నులు చెల్లించే పన్నుదారులకు రాయితీ ఉంది. దీంతో ప్రతి రోజు కౌంటర్లు నిర్ణీత వేళల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు సెలవు దినాల్లోనూ సిబ్బందిని నియమించే ఏర్పాట్లు చేశారు. కాగా ముందస్తు పన్ను చెల్లింపు ద్వారా ఈ నెల 1వ నుంచి 13 వ తేదీ వరకు రూ.4,48,63,586 ఆదాయం వచ్చింది.

5 శాతం రాయితీని వినియోగించుకోండి



రాష్ట్ర ప్రభుత్వం ముంద స్తు పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తోంది.దీనికి నగర ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈనెలాఖరు వరకు గడువు ఉంటుంది. ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ సెలవు దినాల్లోనూ కౌంటర్లు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. ముందస్తు ప న్నులు చెల్లించి నగర అభివృద్ధికి పాటుపడాలి.
–రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నీటి పారుదల శాఖ విశ్రాంత డీఈ గురిజాల విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ మధుబాబు నేతృత్వంలోని వైద్య బృందం షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మోకాళ్ల నొప్పులు ఉన్న వారికి మర్దన చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

108 కోట్ల శ్రీరామ నామ లిఖిత యజ్ఞం

కర్నూలు కల్చరల్: అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పురస్కరించుకొని అవోపా ఆధ్వర్యంలో 108 కోట్ల శ్రీరామ నామ లిఖిత యజ్ఞం చేపట్టినట్లు అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. భక్తులు రాసిన రామ కోటి పుస్తకాలు అయోధ్య శ్రీరామ చంద్ర మూర్తి సన్నిధికి చేరతాయని తెలిపారు. రామ కోటి లిఖిత పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా గో సంరక్షణ శాల, అవోపా సేవా సదన్‌లో సంప్రదిస్తే పుస్తకాలు అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 93938 10551 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీతపై ప్రవచనం చెబుతున్న రామకృష్ణ ప్రభు



అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. సమస్త సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

‘బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం’

కర్నూలు(సెంట్రల్): బీజేపీ మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీపీఎం, సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ప్రజాచైతన్య యాత్రల్లో భాగంగా కర్నూలు నగరంలోని 23,24వార్డుల పరిధిలో నాయకులు ఇంటింటా తిరిగి బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వ ఆస్తులను పూర్తిగా ప్రైవేటీకరిస్తారన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతాయన్నారు. రాష్ట్రంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం మోదీ ప్రభుత్వానికి వంతపాడుతూ ప్రజ్యావతిరేక విధానాల్లో పాలు పంచుకుంటోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.నరసింహులు, టి.రాముడు, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు (టౌన్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న లక్ష్మీ నరసింహ కల్యాణ మండపం హాల్లో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులకు గ్రేడింగ్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా ఏదో క్రీడలో సాధన చేయాలన్నారు. క్రీడలతో ఆరోగ్యం, శారీరక ధృఢత్వం, ఆత్మవిశ్వాసం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: శాకుంతలం, దసరా, రుద్రుడు, బలగం, విడుదల పార్ట్–1, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : మీటర్, విడుదల పార్ట్–1, శాకుంతలం, రుద్రుడు, దసరా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విడుదల పార్ట్–1, శాకుంతలం, రుద్రుడు
ఐనాక్స్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, జాన్ విక్ చాప్టర్–4, రావణాసుర, విడుదల పార్ట్–1, రుద్రుడు
భరత్ కాంప్లెక్స్ : బలగం, మీటర్, ది పోప్స్ ఎక్సార్సిస్ట్
శ్రీరామ : మీటర్
రాజ్ : రావణాసుర
విజయ : మీటర్

క్రమశిక్షణతో సాధన చేయాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో జిల్లా స్థాయి జంప్‌రోప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జంప్‌రోప్ అసోసియేషన్ అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, జోసఫ్ పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి

కర్నూలు కల్చరల్: సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని కేవీఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మామిదాలపాడులో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజలు అందరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో 50 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరికీ గ్యాస్ ప్రమాదాల పట్ల అవగాహన అవసరమని అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్ మెన్ నరసింహుడు అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏ.క్యాంపులోని చాణిక్యపురి కాలనీలోని గృహ సముదాయాల వద్ద అగ్నిమాపక శాఖ అవగాహన కార్యక్రమం చేపట్టింది. గ్యాస్ లీకేజీ, ప్రమాదాలు నివారణ, అప్రమత్తంగా ఉండటం, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్లు లింగమూర్తి, సుధాకర్, నాయక్, మల్లేష్ పాల్గొన్నారు.

ఇసాఖియా మసీదులో ఇఫ్తార్ విందు





ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. ఆదివారం స్థానిక రోజా వీధిలోని ఇసాఖియా మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనం నిర్వహించారు. కార్యక్రమంలో రోజా దర్గా ముతవల్లి దాదా బాషా ఖాద్రీ, ముస్లిం పెద్దలు సయ్యద్ ఖాలీలుల్లా ఖాద్రీ, ఖాలిద్, కార్పొరేటర్లు యూనుస్ బాషా, షాషావలి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఖుబ్సూరత్ మసీదులో..
కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక 10వ వార్డులోని ఖుబ్సూరత్ మసీదులో ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాషా, షేక్షా, మాబుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి సుజన హితైషి పురస్కారం



డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈ-అభ్యాస్ నిర్వాహకులు

కర్నూలు(హాస్పిటల్): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ–అభ్యాస్ అనే విద్యాసంస్థ ఆదివారం కర్నూలుకు చెందిన కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి సుజన హితైషి అనే పురస్కారాన్ని ఇచ్చి సన్మానించారు. వైద్యరంగంలో తాను అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందజేశారని డాక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ సంస్థ ఏపీ, తెలంగాణాల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు తక్కువ ఖర్చులో కార్పొరేట్ విద్యను అందిస్తోందని, పోటీ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులలో స్ఫూర్తి నింపుతోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ, శాంతా బయోటిక్ చైర్మన్ పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, ఈ–అభ్యాస్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ



గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: ముందస్తు జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎద్దుల నారాయణరెడ్డి కాంప్లెక్స్‌లో అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మహబూబ్ దౌలత్ తన సిబ్బందితో కలిసి మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు డిష్ రవి, హనుమంతు, అగ్నిమాపక సిబ్బంది కేశవులు, రఘురాముడు, మల్లికార్జున, జయరాముడు, అనీల్, బ్రహ్మేశ్వర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



గోరంట్ల రెసిడెన్షియల్ పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పాణ్యం: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రెసిడెన్సియల్ బాల, బాలికల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 504 మందిగాను 427మంది హాజరై పరీక్ష రాశారు. బీసీ వెల్ఫేర్ సెక్రటరీ క్రిష్ణ మోహన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కోడుమూరు రూరల్: ఐదవ తరగతి ప్రవేశానికి ఆదివారం మండలంలోని గోరంట్ల మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన ఎంజేపీ ఏపీ బీసీ సెట్–2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 527 మంది విద్యార్థులకు గాను 482 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ షమ్షన్నీషా తెలిపారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



జాతీయ నాయకుల ఫొటోల గురించి వివరిస్తున్న విద్యార్థులు

గడివేముల: మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆకటుకుంది. హెచ్ఎం శ్రీనివాసులు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు పలు నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. ముఖ్యంగా దేశనాయకులు, రాజకీయ, భౌతిక పటాలు, వర్షమాపకం, వర్షపునీటిని నిల్వ చేయడం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మట్టిపొరలు, వాతావరణ కాలుష్యం, పేదవాడి ఫ్రిజ్, జాతీయ చిహ్నాల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని హెచ్ ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, నాగన్న, కళ్యాణ్, హేమేంద్ర, లక్ష్మణకుమార్, ఖాదర్‌బాషా, నూరుల్లా, రెహానా, షేక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



చింతలముని నగర్‌లో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 35వ వార్డులోని చింతలముని నగర్‌లో పర్యటిస్తూ ప్రజల స్పందన తెలుసుకున్నారు. అంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాల ప్రయోజనం అర్హులకు అందుతుందన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫారసులు ఉన్నవారికే పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. మునగాల పాడు నుంచి సమ్మర్‌స్టోరేజ్ పైపు లైను పనులు ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కల్లూరు అర్బన్ పరిధిలో 8 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే కర్నూలు నగరంలో మాదిరిగా కల్లూరు వార్డుల్లో ప్రతిరోజు నీటి సరఫరా అవుతుందన్నారు.

ప్రతి గడపకూ లబ్ధి చేకూరింది
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. ఆదివారం 35వ వార్డు 89వ వార్డు సచివాలయం పరిధిలోని చింతలముని నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మాధురి, డీఎల్ కాంతారెడ్డి, వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, వీరయ్య, శివ, తిరుపాల్, రంగప్ప, రమణారెడ్డి, హనుమంతయ్య, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: గడివేముల గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మామిడికాయల మహమ్మద్ హుసేన్ అనే వ్యక్తి ఈ సందర్భంగా ప్రభుత్వం వల్ల తనకు చేకూరిన లబ్ధి గురించి చెప్పి వచ్చే ఎన్నికల్లో వైస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటామన్నారు.

బిల్లుల చెల్లింపు చాలా సులువు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ చెల్లించడం చాలా సులువు అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తయి అందరికీ డిమాండ్ నోటీసులు జారీ చేశామని, బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడి నుంచైనా చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు.

4న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని అరుణాచల క్షేత్ర దర్శనం కోసం మే 4వ తేదీన కర్నూలు–1 డిపో నుంచి ఇంద్ర ఏసీ బస్సు నడుపుతున్నట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న గురువారం ఉదయం 6 గంటలకు ఈ బస్సు కర్నూలు నుంచి బయలుదేరి మార్గమధ్యలో కాణిపాకంలో వినాయకుని దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర దర్శనం అనంతరం మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరి మార్గమధ్యలో వేలూరు స్వర్ణ దేవాలయం, నారాయణి అమ్మవారి దర్శనం అనంతరం 6వ తేదీ ఉదయం 6 గంటలకు బస్సు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. రానుపోను చార్జీ రూ.2,500 ఉంటుందని, ముందస్తు టిక్కెట్లు పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 7702774358ను సంప్రదించాలని సూచించారు.

నీరజారెడ్డి మృతికి సంతాపం

కర్నూలు కల్చరల్: ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి మృతికి బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కో కన్వీనర్ కపిలేశ్వరయ్య సంతాపం ప్రకటించారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వస్తుండగా జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద కారు బోల్తా పడిన ఘటనలో నీరజా రెడ్డి దుర్మరణం చెందారని పేర్కొన్నారు. ఆమె మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గార్గేయపురం వాసుల హర్షం

కర్నూలు (న్యూటౌన్): గార్గేయపురంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ చర్యలు తీసుకున్నారు. గ్రామ పెద్దల విన్నపం మేరకు ఊరిలో మంచినీటి బోరు మంజూరు చేయించారు. దీంతో గార్గేయపురం గ్రామ సర్పంచ్ సోమేశ్వరి, మాజీ సర్పంచ్ ఏసేపు, గ్రామ పెద్దలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి



జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞా శాలి కందుకూరి వీరేశలింగం పంతులు అని వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆదివారం సంఘ సంస్కర్త కందుకూరి వీరేశ లింగం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారులు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, చంద్రమ్మ, నసీమాబీలు పాల్గొని కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కందుకూరి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

– కందుకూరి వీరేశ లింగం పంతులు జయంతిని పురస్కరించుకుని కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్ పింగళి సూరన తెలుగు తోటలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాకారులు కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రపుసాల అంకయ్య మాట్లాడుతూ వీరేశం లింగం పంతులు మొదటి తెలుగు నాటకం రచించి ప్రదర్శించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, సభ్యులు తిరుపాలు, గోవిందరాజులు, వి.వి.రమణాచారి, సుబ్బయ్య, నాగేశ్వరరావు, మనోహర్‌బాబు, ఎలమర్తి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కల్లూరు: ఆపద సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి రాజీవ్‌నాయక్, సభ్యులు అన్నారు. ఆదివారం కృష్ణనగర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. పురుషులతో పాటు పలువురు మహిళలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, మల్లికార్జున, నైమూర్, జనార్దన్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



పుస్తకాలు, బ్యాగ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: దాతల సేవలు అభినందనీయమని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం శరీన్‌నగర్‌లోని పాఠశాలలో ట్రాంట్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, పెద్దవారికి పనిముట్లు అందజేశారు. సంస్థ అధినేత లోక్‌నాథ్‌రెడ్డి, తేజస్వీని, అడ్వకేట్లు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

భక్తులకు తాగునీరు సరఫరా

గూడూరు: తిమ్మగురుడు స్వామి జాతరలో భక్తుల తాగునీటి అవసరాల కోసం మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ నాయకురాలు బుట్టా రేణుక ట్యాంకర్ ఏర్పాటు చేశారు. దీనిని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు ప్రారంభించి భక్తులకు తాగునీరందించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు సుభాకర్, ప్రతాప్ పాల్గొన్నారు.

అట్టహాసంగా సైకిల్ పందేలు

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం చైతన్య యూత్ అధ్యక్షుడు ఎల్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైకిల్ రేస్, పరుగు పందేలు నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్ఐ నరేంద్ర ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, నిర్వాహకులు పి.కృష్ణ మనోహర్, ఉగ్ర, విశ్వనాథాచారి తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బుధవారం జరిగే సాంస్కృతిక పోటీల్లో బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

భక్తజన సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: గడివేములలో మూలపెద్దమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆదివారం ఆలయప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.